క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న గ్రామస్తులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం 22వ రోజు కొనసాగింది. కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేసేవరకు దీక్ష విరమించేది లేదని ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు అన్నారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బందికి సన్మానం



సన్మానం పొందిన వైద్యసిబ్బందితో హరికృష్ణ

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామంలో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని యువజన సంఘాల సమాఖ్య కార్యదర్శి మేడి హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో కంటి వెలుగు వైద్యశిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న నర్సులను ఆయన సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, నర్సులు పద్మ, స్వరాజ్యం, పుష్పలత, పద్మ లత, వెంకన్న పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరంలో పాల్గొన్న సిబ్బంది, అధికారులు

నల్లగొండ క్రైం : ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నేపర్తి బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని బెటాలియన్‌లో అన్నేపర్తి గ్రామస్తులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ తిరుపతి, వెంకన్న, సైదులు, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ ఉపసర్పంచ్‌గా చింతల రష్మి



నియామకపత్రం చూపుతున్న ఉపసర్పంచ్ రష్మి

కట్టంగూర్ : కట్టంగూర్ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌గా 14వ వార్డు సభ్యురాలు చింతల రష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఎంపీడీఓ) పోరెళ్ల సునీత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నికల్లో 14మంది వార్డు సభ్యులతో పాటు సర్పంచ్ చెనగోని సతీష్ పాల్గొన్నారు. ఉపసర్పంచ్‌గా చింతల రష్మిని మాజీ ఉపసర్పంచ్ అంతటి శ్రీను ప్రతిపాదించగా 2వ వార్డు సభ్యురాలు ఐతగోని సునీత బలపరిచారు. పోటీగా ఎవరూ లేకపోవడంతో ఎంపీడీఓ రష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ అథర్ ఫర్వేజ్, సూపరింటిండెంట్ చలపతి, వార్డుసభ్యులు తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

మాడుగులపల్లి : మండల కేంద్రంలోని రైతు ఆగ్రో సేవా కేంద్రంలో సబ్సిడీ జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ సైదానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల బ్యాగు సబ్సిడీపై రూ.842, 40 కిలోల జనుము విత్తనాల బ్యాగు రూ.1224, 20 కిలోల పిల్లి పెసర విత్తనాల బ్యాగు రూ.703 చెల్లించి పొందవచ్చని పేర్కొన్నారు. అవసరం ఉన్న రైతులు ఆగ్రో సేవా కేంద్రంలో లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని ఆయన సూచించారు.

'రైతుబంధు' దేశానికి ఆదర్శం

వేములపల్లి : రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట పెట్టుబడి కోసం ఏ ఒక్క రైతు అప్పులు చేసి ఇబ్బందులు పడకూడదని సీఎం కేసీఆర్ రైతుబంధు పథకం తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో కాట్రగడ్డ రాజగోపాల్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పెదపంగ సైదులు, నగేష్, సైదిరెడ్డి, హరీష్, రవి పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని అవస్థలు



నకిరేకల్‌లోని తాగునీటి సంపు



నకిరేకల్‌లో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంక్

- మున్సిపాలిటీలో పూర్తికాని మిషన్ భగీరథ పనులు
- ఇంటింటికి అందని కృష్ణాజలాలు
- పట్టించుకోని అధికారులు

నకిరేకల్ : వేసవిలో మున్సిపాలిటీ ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడాల్సివస్తుంది. రోజురోజుకు విస్తరిస్తున్న నకిరేకల్ మున్సిపాలిటీలో ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీరు సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు ప్రైవేట్ మినరల్ వాటర్‌ప్లాంట్లను ఆశ్రయించాల్సివస్తుంది. దాహార్తి తీర్చడానికి మిషన్ భగీరథ పథకం కోసం పట్టణ ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మున్సిపాలిటీలో మిషన్ భగీరథ కింద ఐదు ట్యాంక్‌లు మంజూరయ్యాయి. ఈ ట్యాంక్‌ల నిర్మాణం జరిగినప్పటికీ వాటికి సంబంధించిన పైప్‌లైన్ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో ఇంటింటికీ మిషన్‌భగీరథ నీరు అందని ద్రాక్షగా మారింది. పైపులైన్ పనులు పూర్తిచేయకపోవడంతో చేసేదిలేక మిషన్‌భగీరథ ట్యాంకులను కృష్ణా జలాలను నింపి ఇంతకు ముందుఉన్న పాత పైపులైన్ల ద్వారా పబ్లిక్ ట్యాంకులు, నల్లాకు నీరు వదులుతున్నారు. ప్రతి వేసవికాలంలో పట్టణ ప్రజలకు తాగునీటికి తిప్పలు తప్పడం లేదని పలువురు పట్టణవాసులు వాపోతున్నారు. 22సంవత్సరాలుగా నల్లగొండ సమీపంలోని పానగల్ రిజర్వాయర్ నుంచి తాగునీరు సరఫరా అవుతుండగా ఇటీవల నకిరేకల్ మండలంలోని నెల్లిబండ గుట్టపై ఉన్న మిషన్ భగీరథ సంప్ నుంచి కూడా పట్టణానికి కృష్ణాజలాలు సరఫరా చేస్తున్నారు. అయినా పట్టణంలో తాగునీటి పరిస్థితి మెరుగుపడటం లేదు.

రోజురోజుకు విస్తరిస్తున్న పట్టణం..

పట్టణానికి వలస వచ్చేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటిని సరఫరా చేయడంలో ఇబ్బందులు తప్పడం లేదు. రోజురోజుకు విస్తరిస్తున్న పట్టణానికి 17ఏళ్ల క్రితం అప్పటి ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీటి కెటాయింపులు చేశారు. ప్రస్తుతం పానగల్ నుంచి 5లక్షల లీటర్లు, నెల్లిబండ గుట్టపై ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు నుంచి మరో 5లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఆ నీరు చాలక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ పూర్తి కాకపోవడంతో ఇళ్లలోకి తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆయా వీధుల్లోని మినీట్యాంక్‌లు, పబ్లిక్‌నల్లాల ద్వారా వారినికోసారి తాగునీటిని సరఫరా చేస్తుండడంతో వాటి వద్ద గంటల తరబడి కాళీ బిందెలు, క్యాన్‌లతో నిరీక్షిస్తూ ప్రజలు అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా వాడకానికి వచ్చే నీరుసైతం నాలుగు రోజులకోసారి సరఫరా అవుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ఇంటింటికి కృష్ణాజలాలను పూర్తి స్థాయిలో అందించాలని, అదేవిధంగా వాడకానికి ప్రతిరోజు నీరు వచ్చేవిధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మిషన్‌భగీరథ పైప్‌లైన్‌లు వేయలేదు



వారానికోసారి కృష్ణ జలాలు సరఫరా అవుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంటింటికి మిషన్ భగీరథ మంచినీరు అందిస్తామన్నారు. మా వార్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఇంకా వేయలేదు. ఇంటింటికి నల్లాల ద్వారా మంచి నీటిని సరఫరా చేయాలి. కృష్ణ జలాల పబ్లిక్‌నల్లాలు కూడా పెంచాలి.

– రావిరాల నర్సింహ, మార్కెట్‌రోడ్డు, నకిరేకల్

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పట్టణంలో తాగునీటికి ఇబ్బందులు తలత్తెకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం మిషన్ భగీరథ పైపులైన్ పనులు ఇంకా పూర్తి కాలేదు. నల్లగొండలోని పానగల్, నెల్లిబండ గుట్టపై ఉన్న మిషన్ భగీరథ సంప్‌ల నుంచి పట్టణానికి నీటిని అందిస్తున్నాం. త్వరలోనే మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ఇంటింటికి నీరు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– బాలాజీ, మున్సిపల్ కమిషనర్

మండి గ్రిల్స్ ఏర్పాటు అభినందనీయం



మండి గ్రిల్స్ ప్రారంభిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి తదితరులు

రామగిరి(నల్లగొండ) : పట్టణ ప్రజల అవసరాలకు, అభిరుచులకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో మండి గ్రిల్స్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్ బీట్ మార్కెట్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన మండి గ్రిల్స్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఆయన జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎన్.భాస్కర్‌రావులతో కలిసి ప్రారంభించారు. రుచికరమైన వంటకాలు అందరిని ఆకట్టుకోనేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. మండి గ్రిల్స్ నిర్వాహకులు ఇమ్మడి ప్రశాంత్‌కుమార్, మేకల సంజయ్ మాట్లాడుతూ.. రుచికరమైన వంటకాలతో పాటు ఎంటర్ టైన్‌మెంట్ కల్పించాలనే ఉద్దేశంతో రెస్టారెంట్ ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, యామ దయాకర్, ఇమ్మడి బుచ్చయ్య, పున్న ప్రభాకర్, పున్న చండీశ్వర్, పున్న రామకృష్ణ, విశ్వేశ్వర్, ఎల్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తరుగు లేకుండా కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దైద రవీందర్

నకిరేకల్ : రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యానికి ఎలాంటి తరుగు, కోతలు లేకుండా మద్దతు ధరతో కొనుగోళ్లు చేయాలని టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని మండలాల్లో కొనుగోళ్ల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్రాలకు ధాన్యం వచ్చి రెండు నెలలు అవుతున్నా కొనుగోళ్లు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీలు ఇచ్చిన అమలు కావడం లేదన్నారు. తేమ ఉందనే సాకుతో బస్తాకు 2నుంచి 5కేజీల తరుగు విధిస్తున్నట్లు రైతులు వాపోతున్నారని అన్నారు. సమావేశంలో యూసఫ్, వంటిపాక సతీష్, చెనగాని రాజశేఖర్‌గౌడ్, పందిరి సతీష్, నక్షత్ తదితరులు ఉన్నారు.

సీపీఆర్ విధానంపై అవగాహన కలిగిఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శ్రీదేవి, అధికారులు తదితరులు

నకిరేకల్ : సీపీఆర్ విధానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల వారికి ఆరోగ్యం, గుండెపోటు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజల ఆరోగ్య విషయంలో సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు, ఆలోచనలు అభినందనీయమని అన్నారు. అనంతరం అకస్మాత్తుగా గుండెపోటు వస్తే ఏవిధంగా తక్షణ చర్యలు తీసుకోవాలో ప్రత్యక్షంగా ఆమె సీపీఆర్ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అండాలు, ఓగోడు ఆరోగ్య కేంద్రం డాక్టర్ యోగేశ్వి, ఐసీడీఎస్ సీడీపీఓ అంజుం, ఎంపీఓ నాగలక్ష్మి, హెచ్ఈఓ రాపోలు రవి, వైద్యసిబ్బంది సుకన్య, ఇన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తేవాలి



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ ఎల్లయ్య

చండూరు: ధాన్యాన్ని తాలు లేకుండా తూర్పార పట్టి 17శాతంలోపు తేమ వచ్చే విధంగా ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తేవాలని మునుగోడు ఏడీఏ డి.ఎల్లయ్య సూచించారు. శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. కేంద్రం నిర్వాహకులు ఎప్పటికప్పుడు లారీలు, బస్తాలు సమకూర్చుకొని కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలన్నారు. వర్షమొచ్చే సూచనలు ఉన్నందున ధాన్యం రాశులు తడవకుండా పట్టాలు కప్పుకునే విధంగా రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం మార్కెట్ కమిటీ మీటింగ్ హాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు చేసుకునే రైతులు వివరాలు సేకరించాలన్నారు. పీఎం కిసాన్ కేవైసీ చేసుకోని రైతులను గుర్తించి వెంటనే చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పి.మల్లేష్, ఈఏఓలు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్‌లోకి దూసుకెళ్లిన డీసీఎం



శాలిగౌరారంలో పెట్రోల్‌బంక్‌లోకి దూసుకెళ్లిన డీసీఎం వాహనం

శాలిగౌరారం: అతివేగంగా వెళ్తున్న డీసీఎం అదుపుతప్పి పెట్రోల్‌బంక్‌లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన శాలిగౌరారం మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. శాలిగౌరారం మీదుగా నకిరేకల్ వైపు తవుడు లోడుతో ఉన్న డీసీఎం మండల కేంద్రంలోని శ్రీకంఠమహేశ్వర దేవాలయం వద్ద మూలమలుపు వద్ద అదుపుతప్పి హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లింది. బంక్ ఎదుట లోగో బోర్డు ఉన్న ఇనుప స్తంభానికి తగిలి నిలిచిపోయింది. ప్రమాద సమయంలో బంక్ సిబ్బంది విశ్రాంతి గదిలో నిద్రిస్తున్నారు. డీసీఎం నేరుగా బంక్‌లోకి దూసుకెళ్లి ఉంటే రెండు పంపులు ధ్వంసమై బంక్ పేలిపోయి ఉండేదని సిబ్బంది తెలిపారు.

సెల్‌ఫోన్ జారిపడటంతో..

డీసీఎం వాహన డ్రైవర్ తన సెల్‌ఫోన్‌ను మీటర్ బాక్స్ వద్ద పెట్టగా అది జారి డ్రైవర్ కాళ్ల వద్ద పడిపోయింది. ఈక్రమంలో సెల్‌ఫోన్‌ను తీసుకుంటుండగా.. అప్పటికే వేగంలో ఉన్న డీసీఎం మూలమలుపు కావడంతో అదుపుతప్పి పెట్రోల్‌బంక్‌లోకి దూసుకెళ్లినట్లు తెలుస్తుంది.

వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలి



చండూరు(గట్టుప్పల) : తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన వీఆర్‌ఏలు



కట్టంగూర్ : తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు



మునుగోడు : తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

చండూరు(గట్టుప్పల) : సీఎం కేసీఆర్ గతంలో అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని వీఆర్‌ఏల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు గట్టుప్పల, చండూరు మండలాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట వీఆర్‌ఏలు శుక్రవారం నిరసన చేపట్టారు. అర్హత కలిగిన వారికి ప్రమోషన్స్ ఇవ్వాలని, 55 ఏళ్లు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు శంకర్, లక్ష్మయ్య, యాదయ్య, సావిత్రి, నర్సింహ తదితరులు ఉన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి

మునుగోడు : ఉద్యోగ భద్రత కోసం తమకు ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశాడు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏలు శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింహ, లింగస్వామి, యాదయ్య, వెంకటయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ మండల వీఆర్‌ఏలు శుక్రవారం తహసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు గద్దపాటి సైదులు, నాయకులు జి.నాగమల్లేశ్వరి, ఎం.శివకుమార్, ఫరీద్, సువర్ణ, సంధ్యారాణి, కృష్ణయ్య, రవి, నాగార్జున తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సమస్యలు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహాగౌడ్

మునుగోడు : గ్రామాల్లో నెలకొన్న సమస్యలు కాంగ్రెస్ పార్టీతోనే పరిష్కారమవుతాయని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహాగౌడ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామగ్రామాన పార్టీ బలోపేతం కోసం ఈనెల 15నుంచి గ్రామ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామశాఖ సమావేశాలకు ప్రతి కార్యకర్త హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్వాయి చెన్నారెడ్డి, కుంభం చెన్నారెడ్డి, మేక ప్రదీప్‌రెడ్డి, పగిళ్ల శ్రీనివాస్, కందుల సూర్యప్రకాష్, పులకరం హనుమంతు, రాజు, భాస్కర్, శ్రవణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ దిష్టిబొమ్మ దహనం

మిర్యాలగూడ అర్బన్ : రెజ్లర్లపై లైంగిక వేధింపులకు నిరసనగా బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏఐకెఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో అతడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ అంతర్జాతీయంగా దేశానికి పతకాలు తెచ్చి గౌరవాన్ని, ప్రతిష్టలను పెంచిన వారిపై వేధింపులు ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రవినాయక్, సైదమ్మ, వెంకటయ్య, సైదులు, గోపి, చంద్రమౌళి పాల్గొన్నారు.

వస్త్ర దుకాణం దగ్ధం

నల్లగొండ క్రైం: పట్టణంలోని ప్రకాశం బజార్‌లో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ వస్త్ర దుకాణం దగ్ధమైంది. భారీగా మంటలు వ్యాపించడంతో సమీపంలోని నివాసాల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పి వేశారు. నష్టం వివరాలు తెలియరాలేదు.



విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన వస్త్ర దుకాణం

వీఓఏల సమ్మె ఉధృతం చేస్తాం

నల్లగొండ టౌన్ : ఐకేపీ వీఓఏల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో 18వేల మంది వీఓఏలు పని చేస్తున్నారన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలన్నారు. సమావేశంలో ఎస్‌కే సైదాబి, జంగయ్య, అహల్య, కోటిరెడ్డి, మంగమ్మ, భజరంగ్ ప్రసాద్, పద్మ, సువర్ణ, వెంకన్న, శ్రీదేవి, మంజుల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..

చోద్యం చూస్తున్న విద్యుత్ అధికారులు

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు హైలెవల్ విద్యుత్ తీగలను పిచ్చిమొక్కల తీగలు దట్టంగా అల్లుకున్నాయి. దీంతో గాలి, వర్షం వచ్చిన సమయంలో పెద్దఎత్తున మంటలు రావడంతో పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. అయినా విద్యుత్ అధికారులు తీగలను తొలగించాలనే ఆలోచన లేకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రమాదకరంగా మారిన పిచ్చిమొక్కల తీగలను వెంటనే తొలగించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

– మునుగోడు



విద్యుత్ తీగలకు అల్లుకున్న పిచ్చిమొక్కల తీగలు

పశుగ్రాసానికి భలే గిరాకీ



వేమిరెడ్డిగూడెంలో రైతు పొలంలో కట్టిన గడ్డికట్టలు

- ఒక్కో కట్టకు రూ.15నుంచి రూ.20వరకు చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న దళారులు
- రూ.110నుంచి రూ.130వరకు అమ్ముకుంటున్న వైనం

కనగల్ : రబీలో సాగుచేసిన వరిగడ్డికి మంచి గిరాకీ లభిస్తుంది. రైతుకు ఒక్కో గడ్డి కట్టకు రూ.15నుంచి రూ.20వరకు చెల్లించి దళారులు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మండలం ఆయకట్టు ప్రాంతం కావడంతో ఇక్కడ గడ్డి సమృద్ధిగా ఉండటంతో మండలంలో పలువురు గడ్డిని కొనుగోలు చేసి రంగారెడ్డి జిల్లా మాడుగుల, మాల్, ఇబ్రహీంపట్నం, మల్లేపల్లి, మర్రిగూడెం వంటి దూర ప్రాంతాలకు తీసుకెళ్లి పాడిరైతులకు అమ్ముతున్నారు. దూరాన్ని బట్టి అక్కడ ఒక్కో గడ్డి కట్టకు రూ.80నుంచి రూ.110వరకు అమ్ముతున్నట్లు పేర్కొంటున్నారు. దీంతో తమకు 40రోజుల పాటు ఉపాధి దొరుకుతుందని ట్రాక్టర్, గడ్డికట్టల యంత్రాల యజమానులు తెలుపుతున్నారు. ఒక్కో ట్రాక్టర్‌పై 110గడ్డికట్టల నుంచి 130వరకు తీసుకెళ్తున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు. అన్ని ఖర్చులు పోను ఒక్కో ట్రాక్టర్ మీద తమకు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు మిగులుబాటు చేసుకుంటున్నారు. ఒక్కో గడ్డి కట్ట కట్టడానికి యాంత్రానికి రూ.30ఖర్చవుతుంది. ఇలా మండలం నుంచి రోజుకు 100ట్రాక్టర్లకు పైగా పశుగ్రాసాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.



పగిడిమర్రి నుంచి రంగారెడ్డి జిల్లా మాడుగులకు తరలిస్తున్న వరిగడ్డి కట్టలు



దోరెపల్లి నుంచి మాల్‌కు..



లింగాలగూడెం గ్రామంలో వాము వేసుకుంటున్న రైతులు